- ఎంపిక కోసం త్వరలో జిల్లాకు ఏఐసీసీ, టీపీసీసీ పరిశీలకుల రాక
- ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- నియోజకవర్గాల వారీగా అభిప్రాయ సేకరణ
- ఆశావహుల ముమ్మర యత్నాలు

డీసీసీ పీఠం దక్కేదెవరికో..?



జగిత్యాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించింది. డీసీసీ అధ్యక్షుడిని ఎంపిక చేయడానికి కసరత్తు చేస్తోంది. ఈ మేరకు ఏఐసీసీ, టీపీసీసీ కార్యాలయం నుంచి ప్రత్యేక పరిశీలకులను పంపిస్తోంది. దీంతో జిల్లాలో ఆశావహుల హడావుడి మొదలైంది. తమ పొలిటికల్ గాడ్ ఫాదర్స్ ఆశీస్సులతో దరఖాస్తులు చేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని కొడిమ్యాల, మల్యాల, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గం పరిదిలోని మేడిపల్లి, బీమారం, కథలాపూర్ మండలాలకు చెందిన పలువురు సీనియర్ నేతలు డీసీసీ పీఠం దక్కించుకోవడానికి పావులు కదుపుతున్నారు.

● రెండు రోజుల్లో జిల్లా పర్యటన..

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిఎంపిక కోసం ఏఐసీసీ పరిశీలకులతో కూడిన బృందం వచ్చే రెండు, మూడు రోజుల్లో జగిత్యాల జిల్లాలో పర్య టించనుంది. ఈ బృందం జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని మల్యా ల, కొడిమ్యాల, వేములవాడ నియోజకవర్గం పరిధిలోని కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలాలకు చెందిన ముఖ్య నేతలతో సమీక్షలు నిర్వహించనున్నారు. కార్యకర్తలు, పార్టీ క్యాడర్ అభిప్రాయాలను సేకరించనున్నారు.

● ఏఐసీసీ పరిశీలకుడిగా జయకుమార్

డీసీసీ అధ్యక్ష పదవికి నేతను ఎంపిక చేయడానికి తొలుత జగిత్యాల జిల్లాకు ఏఐసీసీ పరిశీలకుడిగా సిద్ధిఖీ, పీసీసీ పరిశీలకులుగా జగ్గారెడ్డి, మహ్మద్ ఖాజా ఫకీరోద్దిన్, కేతూరి వెంకటేశ్, గిరిజ శెట్కార్‌లను నియమించారు. అయితే సిద్ధిఖీ పలు కారణాల వల్ల రాలేకపోవడంతో ఏఐసీసీ పరిశీలకుడి నియామకంలో రెండు రోజుల క్రితం మార్పు చేసింది. జగిత్యాల జిల్లా ఏఐసీసీ పరిశీలకుడిగా తమిళనాడు రాష్ట్రానికి చెందిన మాజీ ఎంపీ డాక్టర్ జయ కుమార్‌ను నియమించింది.

● కాంగ్రెస్‌లో హడావుడి..

జిల్లాకు ఏఐసీసీ, టీపీసీసీ పరిశీలకులు వస్తున్న నేపథ్యంలో డీసీసీ పీఠం కొరకు పోటీపడుతున్న నాయకుల హడావుడి మొదలైంది. ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అభిప్రాయం సైతం కీలకం కానుంది. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అనుచరులకే మళ్లీ పార్టీ పగ్గాలు అప్పగిస్తారని ఆయన అనుచరులు అంటున్నారు. జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి అనుచరుడు, టీపీసీసీ సెక్రెటరీ బండ శంకర్, కోరుట్ల నియోజక వర్గానికి చెందిన టీపీసీసీ

- మిగతా 10లో

సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించాలి

● జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్



మల్యాల ఠాణాలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

మల్యాల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ అశోక్‌కుమార్ పోలీసులకు సూచించారు. మల్యాల పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, కేసు డైరీలు, రిజిష్టర్లు పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకొని త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. బాధితులతో మర్యాదగా ప్రవర్తించాలని, నిష్పక్షపాతంగా విచారణ చేసి న్యాయం జరిగే విధంగా ఉండాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి చూపుతూ, స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరచూ సందర్శించాలని పేర్కొన్నారు. పాత నేరస్తులపై నిఘా పెట్టాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను యాక్సిడెంట్ జోన్స్, బ్లాక్ స్పాట్స్ గుర్తించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని పేర్కొన్నారు. డయల్ 100కు కాల్ రాగానే వెంటనే సంఘటన స్థలంకు చేరుకొని సమస్య పరిష్కారించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరంగస్తీ నిర్వహించాలని సూచించారు. ఎస్పీ గారి వెంట డిఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

నూతన డీఎస్పీలను అభినందించిన ఎస్పీ

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): నూతనంగా గ్రూప్-1లో డీఎస్పీగా ఎంపికైన జగిత్యాల జిల్లాకు చెందిన పలువురిని ఎస్పీ అశోక్ కుమార్ బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా డీఎస్పీలుగా ఎంపికయిన విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రతిభలు ఎస్పీ కార్యాలయంలో ఆయనను కలిశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ క్రమశిక్షణతో ప్రజలకు సేవా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘుచందర్, స్పెషల్ బ్రాంచ్ సిఐ ఆరిఫ్ అలీ ఖాన్ తదదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్‌కు సన్మానం

జగిత్యాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగానికి ఎంపికయి జిల్లాకు శిక్షణ కోసం వచ్చిన కన్నం హరిణి బుధవారం పీఆర్‌టీయూ నేతలు ఘనంగా సన్మానించారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్ కన్నం హరిణిని అభినందించారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు బోయినిపల్లి ఆనందరావు, యాళ్ల అమర్‌నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లిటరసీపై అవగాహన

కోరుట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ లిటరసీపై విద్యార్థులకు అవగాహన పెంపొందించాలని బాలికలపాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, రిసోర్స్‌పర్సన్ నాగరాజు, సంతోష్‌లు అన్నారు. బుధవారం పట్టణంలోని బాలిక పాఠశాలలో కోరుట్ల, కథలాపూర్, బీమారం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న డిజిటల్ లిటరసీ శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో వారు మాట్లాడారు. తప్పనిసరై ప్రభుత్వ పాఠ శాలలో విద్యార్థులకు కోడింగ్ ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్‌పై పట్టుసాధించి పోటీ ప్రపంచంలో రాణించే విధంగా ఉపాధ్యాయులు చొరవచూపాలని అన్నారు. కార్యక్రమంలో సిఆర్‌పీలు గంగాధర్, జ్యోతి, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

పూల సాగుతో అధిక ఆదాయం

● ఉద్యానవన విస్తరణ అధికారి అన్వేష్



పూల తోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవన అధికారి అన్వేష్

కోరుట్ల రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పూల సాగుతో రైతులు అధిక ఆదాయం పొందవచ్చునని ఉద్యావన విస్తరణ అధికారి అన్వేష్ రైతులను సూచించారు. బుధవారం మండలంలోని జోగినిపల్లి గ్రామంలో పూల సాగుపై విస్తరణ అధికారి అన్వేష్ పరిశీలించి రైతులకు పలు సూచనలు సలహాలను అందించారు. రైతులు వరి, పత్తి వంటి సంప్రదాయ పంటలతో పాటు పూలసాగుపై దృష్టి సారంచిలన్నారు. తక్కువకాలంలో ఎక్కువ ఆదాయం పొందవచ్చునన్నారు. మల్లె, చామంతి, బంతి, గులాబీ ఎకరానికి రూ. 8,000 సిబ్బడీ, లిల్లీ, గ్లాడియెలస్ బంతి దుంప జాతీ పూల సాగుకు ఎకరానికి రూ. 40,000 సబ్సిడి అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమిల్ ఫాం పీల్డ్ అసిస్టెంట్ శ్రావణ్‌లతో పాటు రైతులు పాల్గొన్నారు.

యాదవ హక్కుల సాధనే లక్ష్యం

రాయికల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): యాదవ హక్కుల సాధనే అంతిమ లక్ష్యమని సంఘం జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు గనవేని మల్లేష్ యాదవ్ అన్నారు. మండలంలోని మైతాపూర్‌లో గ్రామ యాదవ సంఘం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తొట్ల చిన్నయ్య యాదవ్, అలిశెట్టి బుచ్చిరాములు యాదవ్, తొట్ల మహిపాల్ యాదవ్, గజణవేని మహేష్ యాదవ్, ఉష గంగ మల్లయ్య, గంగుల శ్రీనివాస్ యాదవ్, వంగ మల్లయ్య, దుగ్గిళ్ల ఎల్లయ్య, నాగుల గంగయ్య, నాగుల రాజేందర్, నక్క రాజరెడ్డి, గంగుల గంగారాం తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్

గొల్లపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ అన్నారు. బుధవారం గొల్లపల్లి మండల కేంద్రంలోని రెడ్డి సంఘం ఫంక్షన్ హాల్లో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా నాలుగో మహాసభ జరిగింది. ఈ సభలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. సభ ప్రా రంభానికి ముందు సీఐటీయూ జెండాలను ఆవిష్కరించారు. సీఐ టీయూ జిల్లా అధ్యక్షులు కోమటిచంద్రశేఖర్ అధ్యక్షతన జిల్లా మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా పాలనలో కార్మికుల పొట్టలు కొట్టవద్దని, ఇందిరమ్మ రాజ్యంలో కార్మికులకు ఇప్పటివరకు ఒరిగిందేమీ లేదన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగులు నిత్యం గ్రామాల్లో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ వంటి ఎన్నో రకాల ప్రభుత్వ కార్యక్రమాల్లో పాలు పంచుకుంటు పనులు నిర్వహిస్తున్నారన్నారు. పంచాయతీ కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు విస్మరించాయని ఆరోపించారు. మల్టిపర్పస్ విధానాన్నిరద్దు చేయాలని, జీవో. నెం. 51ని సవరించాలని, కనీసవేతనాలను పెంచాలని, ఉద్యోగభద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సభా వేదిక గా సీఐటీయూ జిల్లా నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా పులి మల్లేశం, జిల్లా అధ్యక్షులుగా కోమటి చంద్ర శేఖర్, జిల్లా ప్రధానకార్యదర్శిగా జంగిలి ఎల్లయ్య, కోశాధికారిగా నేరెళ్ల మోహన్, ఉపాధ్యక్షులుగా న్యాతరి మల్లవ్వ, గుడిసె దేవయ్య, శాతల్ల రాజేందర్, సహాయ కార్యదర్శులుగా సురుగు నవీన మాలోతు రాజు నాయక్, వడ్కపురం రాజయ్య నియమితులయ్యారు. ఈ సభలో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలకృష్ణ, జిల్లా కమీటీ సభ్యు లు వెంకటాచారి, సత్తయ్య సాయి, జోగవ్వ లక్ష్మీనారాయణ, తిరుపతి, వివిధగ్రామాల పంచాయతీకార్మికులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేయాలి





వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ సత్య ప్రసాద్, ఇతర అధికారులు

● వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

జగిత్యాల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావులు అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి చీఫ్ సెక్రటరీ రామకృష్ణ రావుతో కలిసి కలెక్టర్ సత్య ప్రసాద్, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో మౌళికవసతులు కల్పించాలని సూచించారు. సెంటర్లలో గన్నీలు, తూకం, శుద్ధి యంత్రాలు అందుబాటులో ఉండాలన్నారు. వానాకాలం పంట వరిధాన్యం కొనుగోలును పకడ్బందీగా చేయాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో పంట తెలంగాణలో ఎక్కువ మొత్తం లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుం దని తెలిపారు.

వరిధాన్యం కొనుగోళ్లకు సంబంధించి అధికారులకు దిశ నిర్దేశం చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, అధికారులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

జగిత్యాల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఇసుక బజార్‌లో వినియోగదారులకు అందుబాటులో ధరలు ఉంచాలని రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కు మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి బుధవారం లేఖను రాశారు. జిల్లా కేంద్రానికి సమీపాన ఇసుక వనరులు నదులు, వాగులు అందుబాటులో లేకపోవడంతో దూరం ప్రాంతం నుంచి ఇసుక తరలింపు సమస్యలను ప్రజలు ఎదుర్కొంటున్నారన్నారు. సాధారణ ప్రజలకు మెట్రిక్ టన్నుకు రూ.1,400, ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు మెట్రిక్ టన్నుకు రూ.1,200గా ధరలు అమలు చేస్తున్నారన్నారు. జిల్లాలో పలు ప్రాంతాల నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ప్రభుత్వ ఇసుక బజార్‌లో లభించే దానికంటే తక్కువగా వస్తుండడంతో ప్రజలు అటువైపుగా మొగ్గు చూపుతున్నారన్నారు. దీంతో గత నెల రోజులలో జగిత్యాల ఇసుక బజార్‌లో కేవలం సుమారు రూ. 8 లక్షల విలువ గల 500 మెట్రిక్ టన్నుల ఇసుక మాత్రమే విక్రయించారని వివరించారు. ప్రభుత్వ ఇసుక బజార్‌లో వినియోగదారులకు అనుకూలమైన ధరలు అందుబాటులో ఉంచాలని, అక్రమంగా ఇసుక తరలింపు, విక్రయాలను నివారించాల్సిన అవసరముందని రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్‌కు మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి పంపిన లేఖలో కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లి విద్యుత్ ఉపకేంద్రంకు 5ఎంవీఏ అదనపు ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేస్తుండడంతో గురువారం తాటిపల్లి, లంబాడిపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈఈ దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

ఎంపీడీవోగా బాధ్యతల స్వీకరణ

పెగడపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పి.శశికుమార్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పని చేసిన ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి కరీంనగర్ జిల్లాకు బదిలీ అయ్యారు. మల్లాపూర్ మండలంలో విధులు నిర్వహిస్తున్న శశికుమార్‌రెడ్డికి పెగడపల్లి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

బీర్‌పూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామానికి చెందిన యువకుడు జగిత్యాల జిల్లా బీసీ సంక్షేమసంఘం ఉపాధ్యక్షులు నూరవినోద్ బుధవారం ఎంఈవో నాగభూషణం చేతుల మీదుగా విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాస్కర్‌రెడ్డి, ఆర్‌ఐ రాహుల్, నాయకులు జితేందర్ యాదవ్, నారపాక రమేష్, ఆడెపు తిరుపతి, శీలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

● జిల్లా అదనపు కలెక్టర్ రాజాగౌడ్

ధర్మపురి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలో ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాజాగౌడ్ అన్నారు. ధర్మపురి మున్సిపల్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ కార్యాలయంలో ఉన్న సిబ్బంది పని తీరు, సంఖ్య గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే పట్టణంలో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆయన తెలిపారు. మున్సిపల్‌లో సిబ్బంది కొరత ఉందని కమీషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకవెళ్లగా వెంటనే సిబ్బందిని భర్తీ చేసేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. గోదావరి నదీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఇళ్ల నిర్మాణం, అభివృద్ధి పనులను, కొత్తగా మంజూరు చేసిన డంపింగ్‌యార్డు స్థలం వద్దకు వెళ్లి ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ కమీషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్యాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మపురి మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి, వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ రాజాగౌడ్

నరసింహుడి సన్నిధిలో పూజలు

ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాజాగౌడ్ బుధవారం సందర్శించారు. ఆలయం వద్ద ఆయనకు అర్చకులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో ఆయన ప్రత్యేక పూజలు జరిపి స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ ఆధ్వర్యంలో ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేష వస్త్రం కప్పి, చిత్రపటం, ప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు. అంతకు ముందు ఆయన యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అలాగే ఆయన అనుబంధ ఆలయాల్లో కూడ స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ మామిళ్ల శ్రీనివాస్‌రావు, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ధర్మకర్తలు, అర్చకలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

కథలాపూర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని 12 గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం సెర్ప్ ఏపీఎం చిన్నరాజయ్య పరిశీలించారు. సందర్భంగా సీసీలు తెడ్డు అంజయ్య, విజయలక్ష్మీ, అశోక్, రాజు తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణానికి చెందిన రిటైర్డ్ హెచ్ ఎం పుప్పాల రాంచంద్రం ఇటీవల మృతిచెందగా బుధవారం బాధిత కుటుంబాన్ని ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పరామర్శిం చారు. స్థానిక ఎస్‌విఎల్‌ఆర్ గార్డెన్‌లో పుప్పాల రాంచంద్రం దశదినకర్మ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా రాంచంద్రం చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ రావు, రాష్ట్ర బాధ్యులు బోగ శ్రావణి, పడాల తిరుపతి, పన్నాల తిరుపతి రెడ్డి, జుంబర్తి దివాకర్‌తో పాటు, స్థానిక మున్సిపల్ మాజీ చైర్మెన్‌లు గిరి నాగ భూషణం, అడువాల జ్యోతి లక్ష్మణ్, ప్రముఖ వ్యాపారవేత్త మంచాల కృష్ణతో పాటు బీజేపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కొక్కు గంగాధర్, ఆముద రాజు తదితరులున్నారు.

ఏఎంసీ వైస్ చైర్మన్‌కు పరామర్శ

గొల్లపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి ఏఎంసీ వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి తండ్రి గంగారెడ్డి ఐదు రోజుల క్రితం మృతి చెందగా ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, కాంగ్రెస్ పార్టీ మం డల శాఖ అధ్యక్షులు ముస్కు నిశాంత్‌రెడ్డి బుధ వారం పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లంభ ధనవ్వ లక్ష్మణ్, భీంరాజ్‌పల్లె మాజీసర్పంచ్ రేవెళ్ల సత్యానారాయణగౌడ్, నాయ కులు బోయపోతు గంగాధర్, నేరెళ్ల రాజి రెడ్డి, రా జేందర్‌రెడ్డి, స్వామిరెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

● గర్షకుర్తి విష ప్రయోగం ఘటనలో ఇప్పటికే భర్త మృతి



లక్ష్మీ (ఫైల్)

గంగాధర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్షకుర్తిలో వృద్ధ దంపతులపై విష ప్రయోగంలో ఇప్పటికే భర్త మృతి చెంద గా భార్య తొమ్మిది రోజులుగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచింది. గర్షకుర్తిలో ఈ నెల 7న గజ్జల శంకరయ్య అతని భార్య లక్ష్మీలకు అదే గ్రామానికి చెందిన కత్తి శివ మత్తు గుళికలు ఇవ్వ డంతో అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుం డగా శంకరయ్యకు పరిస్థితి విషమించి ఈనెల 8న మృతిచెందాడు. అప్పటి నుం చి కరీంనగర్‌లో చికిత్స పొందుతున్న లక్ష్మీ బుధవారం తుది శ్వాస విడిచింది. వృద్ధ దంపతులపై విషప్రయోగం జిల్లా లో కలకలం రేపింది. గంగాధర ఎస్సై కేసును పలు కోణాల్లో దర్యాప్తు చేసి నిందితుడు కత్తి శివను అరెస్టు చేశారు. నిందితుడి నుంచి నగదు, బంగారం స్వా ధీనం చేసుకున్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందిన ఘటన బుధవారం పెద్దపల్లిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే పట్టణానికి చెందిన వెలిచాల రమేష్(55) కూనారం రోడ్డులో కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న నిచ్చెనను రెండో అంతస్తుకకు తీసుకెళ్తుండగా నిచ్చెన 11కేవీ వైర్లకు తాకి విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో రమేష్ అక్కక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్థం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రమేష్ భార్య సుశీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గోదావరిలో కొట్టుకొచ్చిన ఆర్మూర్ వాసి మృతదేహం

మల్లాపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలంలోని చేపూర్ గ్రామానికి చెందిన జోరిగే గంగాధర్(35) అనే వ్యక్తి మృతదేహం బుధవారం మల్లాపూర్ మండలంలోని కొత్తధాంరాజుపల్లి శివారులోని గోదావరి నదిలో గుర్తించినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జోరిగే గంగాధర్ నిర్మల్ జిల్లా కేంద్రంలో ఫుట్‌వేర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆర్థికంగా నష్టపోయిన గంగాధర్ అప్పు ఎక్కువడంతో ఈ నెల 8న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఈ నెల 10న సోన్ బ్రిడ్జిపై నుంచి గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం కొత్తధాంరాజుపల్లి శివారులోని గోదావరి నదిలో విగతజీవిగా కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా భార్య మౌనిక మృతదేహం పరిశీలించి భర్త జోరిగే గంగాధర్‌దేనని గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దుబాయిలో యువకుడి అనుమానాస్పద మృతి

- స్వగ్రామానికి చేరిన మృతదేహం



తేజ (ఫైల్)

గంభీరావుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామానికి చెందిన పిట్ల తేజ(24) అనే యువకుడు ఇటీవల గల్ఫ్‌లో అనుమానాస్పదంగా మృతిచెందగా, బుధవారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. ఉపాధి నిమిత్తం 8 నెలల క్రితం తేజ రూ.లక్షకు పైగా అప్పు చేసి దూబాయికి వెళ్లాడు. అక్కడ పనిసరిగా లేక ఇబ్బందులు పడ్డ తేజ ఆగస్టు 29న ఇండియాకు వస్తున్నట్టు కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు. ఇండియాకు వచ్చే క్రమంలో అనూహ్యంగా దుబాయిలో తప్పిపోయి, మరుసటి రోజు రూంకు వచ్చాడు. తేజ ఒంటిపై గాయాలు ఉండటంతో ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి నుంచి తిరిగి సెప్టెంబరు 3న తన రూం వచ్చాడు. తెల్లారేసరికి తేజ మళ్లీ రూంలో కన్పించక పోవడం, సెప్టెంబరు 19న పోలీస్‌లకు శవమై కన్పించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తేజ మరణవార్త సెపెంబరు 23న వారి బంధువులకు తెలిసింది. 27 రోజులకు తేజ మృతదేహం స్వగ్రామమైన నాగంపేటకు వచ్చింది. మృతుడికి తల్లిదండ్రులు లత, రాజేష్, తమ్ముడు గౌతమ్ ఉన్నారు.

వ్యవసాయ కూలీ ఆత్మహత్య



శంకరయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలు భరించలేక మనస్థాపం చెందిన వ్యవసాయ కూలీ చాట్ల శంకరయ్య(55) ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని శంకరయ్య వ్యవసాయ కూలి పనులు చేస్తూ జీవిస్తుండేవాడు. కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స అందించినా ఆరోగ్యం కుదుట పడలేదు. మనస్థాపం చెందిన శంకరయ్య ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కొడుకులు నర్సింలు, సురేందర్, కూతురు శిరీష, తల్లి లక్ష్మి ఉన్నారు.

జాడ లేని చేప పిల్లలు



● సమయం మించిపోతున్నా పట్టించుకోని పాలకులు.. అధికారులు

● ఆలస్యమైతే ఎదగడం కష్టం...

ఇల్లందకుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు ఆర్థిక తోడ్పాడును ఇచ్చేందుకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. ఈ ఏడాది చేప పిల్లల పంపిణీ పథకం కొనసాగింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఏటా వర్షాకాలానికి ముందే చేప పిల్లల కోసం టెండర్లు పిలవాల్సి ఉంటుంది. అలా చెస్తేనే చెరువులు నిండే వరకు చేపపిల్లల పంపిణీ సాధ్యమవుతుంది. ఇప్పటి వరకు పంపిణీ చేయకపోవడంతో మత్స్యకారులు ఎదురు చూస్తున్నారు.

ఉసేలేని టెండర్లు...

గతంలో చేప పిల్లల సరఫరాకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ మే నెలలోనే జరిగేది. కాంట్రాక్టర్లు సీజన్ మొదలయ్యే లోపే చేప పిల్లలను మండలాలకు చేప పిల్లలు చేర్చి చెరువుల్లో వదిలేవారు. దీంతో చేప పిల్లల ఎదుగుదల బాగుండేది.

అదను దాటితే అంతే సంగతులు...

అదను దాటిన తర్వాత చేప పిల్లలను చెరువులో వదిలితే వాటి ఎదుగుదల సరిగా ఉండదు. ఆగస్టు, సెప్టెంబరు నెల చివరి లోపే చేప పిల్లల పెంపకాన్ని ప్రారంభించాల్సి ఉంటుంది. అప్పుడే చేప పిల్లల ఉత్పత్తి బాగుంటుంది. లేదంటే ఏ రకమైన చేప అయినా సరే బరువు అంతంతగా పెరుగుతుంది. ప్రభుత్వం చేప పిల్లలకు సంబంధించిన టెండర్లు నిర్వహించాలని మత్స్యకార సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

ఆలస్యమైతే ఎదగడం కష్టం..

యామ శ్రీనివాస్, మత్స్యకారుడు, టేకుర్తి



చేప పిల్లలను ప్రభుత్వం ఆలస్యంగా పంపిణీ చేస్తే వాటి ఎదుగుదల కష్టంగా ఉంటుంది. ప్రతి ఏటా చేపలను పట్టుకొని అమ్మడం వల్ల కొంత ఉపాధి దొరికేది. రెండేళ్లుగా చేప పిల్లల పంపిణీ లేక ఉపాధి కోల్పోతున్నాం. ఇప్పటికే సమయం దాటి పోయింది. ఈ నెలాఖరు వరకైనా పంపిణీ చేయాలి.

ప్రభుత్వం స్పందించాలి

పుట్ట రాజు, మత్స్యకారుడు, వాగొడ్డురామన్నపల్లి



గ్రామాల్లోని చెరువుల్లోకి చేపల పిల్లల పంపిణీ రెండేళ్లుగా నిలిచిపోయింది. ప్రభుత్వం స్పందించి చేప పిల్లలను పంపిణీ చేసి మత్స్యకార్మికులను ఆర్థికంగా ఆదుకోవాలి. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి చెరువుల్లో చేపలను పంపిణీ చేయాలి.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కథలాపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాండ్ర్యాల, తక్కళ్లపల్లి, బొమ్మెన పెద్దవాగులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లు, రెండు టిప్పర్లను బుధవారం రెవెన్యూ అధికా రులు పట్టుకున్నారు. ఈ నెల 15న 'ఆంధ్రజ్యోతిలో' ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కరువు.. అనుమతులకు అధికారుల నిరా కరణ అనే శీర్షికన ప్రచురితమైన కథనా నికి అధికారులు స్పందించారు. ఏకకా లంలో మూడు బృందాలు దాడులు చేసి అక్రమంగా వాగు నుంచి ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్న వాహనాలను పట్టుకున్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కరీంనగర్ రూరల్‌లో..

కరీంనగర్ క్రైం : కరీంనగర్ రూరల్ మండ లం వల్లంపహాడ్‌లో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ యజమాని శ్రవణ్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

కోరుట్ల రూరల్, 15 (ఆంధ్రజ్యోతి) పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేసి కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే ..కోరుట్ల రూరల్ మండంలోని మాదాపూర్ శివారు, రామారావుపల్లె శివారులో వేర్వేరుగా రెండు గ్రూపులు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు జిల్లా సీసీఎస్, కోరుట్ల పోలీసులు దాడులు చేసి వారిని పట్టుకున్నట్లు కోరుట్ల ఎస్సై చిరంజీవి తెలిపారు. మాదాపూర్ శివారులోని గ్రూపులో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.12150లు, ఒక ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీన పరుచుకున్నారు. మరో ఇద్దరు పారిపోయారు. రామారావు పల్లె శివారులో పేకాట ఆడుతున్న మరో గ్రూపు నుంచి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీకుకోగా వారి వద్ద నుంచి రూ, 5100లు ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులు పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. వీరిపైన కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

25 నుంచి యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభలు

గణేశ్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్రథమ మహాసభలను ఈ నెల 25, 26, 27 తేదీల్లో నిజామాబాద్ జిల్లాలో నిర్వహించనున్నట్లు సంఘం నగర కార్యదర్శి అల్లపు అభిలాష్ తెలిపారు. బుధవారం ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలను విజయవంతం చేయాలన్నారు. విద్యారంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలపై చర్చించ నున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో విద్యారంగ సమస్యలపై చేపట్టనున్న కార్యాచరణను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు మణితేజ, అభిలాష్, ఉమామహేశ్వర్, రాకేష్, సాయి కుమార్ పాల్గొన్నారు.

కళాశాల మైదానంలో

అథ్లెటిక్స్ స్టేడియం నిర్మించవద్దు

జమ్మికుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అథ్లెటిక్స్ స్టేడియం నిర్మించవద్దని అఖిలపక్ష విద్యార్థి సంఘం నాయకులు అన్నారు. బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కళాశాల మైదానం విస్తీర్ణం 20ఎకరాలు ఉండేదని, ప్రస్తుతం 8 ఎకరాలకు వచ్చిందన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదన్నారు. అథ్లెటిక్స్ స్టేడియం వస్తే వాకింగ్ చేసేవారికి, ఆడుకునే పిల్లలకు భంగం కలిగే అవకాశాలు ఉంటాయన్నారు. కబ్జాకు గురైన ఇండ్లను కూల్చేసి స్టేడియం నిర్మించాలన్నారు. కార్యక్రమంలో సాయిరాం, వెంకటేష్, సజ్జద్, రత్నాకర్, సుధీర్, రాజేష్, విష్ణు, నవీన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు ఘాట్‌రోడ్డుపై దెబ్బతిన్న బారికేడ్లు



వై జంక్షన్ సమీపంలో పక్కన పడి ఉన్న బారికేడ్



దిగువ కొండగట్టు ఘాట్‌రోడ్డు ప్రారంభంలో దెబ్బతిన్న బారికేడ్

మల్యాల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఘాట్‌రోడ్డుపై ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన బారికేడ్లపై నిర్లక్ష్యం అలుముకుంది. ఏడేళ్ల క్రితం ఘాట్‌రోడ్డుపై జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో సుమారు 67మంది మృతి చెందడంతో ప్రభుత్వం ఈ ఘాట్‌రోడ్డుపై వాహనాల రాకపోకలను నిలిపివేసింది. తరువాత కొన్నాళ్లకు షరతులతో వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వగా భారీ వాహనాలను పూర్తిగా నిషేధించింది. ఇందులో భాగంగా దిగువ కొండగట్టు వద్ద ఘాట్‌రోడ్డు ప్రారంభంలో, ఘాట్‌రోడ్డు చివరలో కొండపై వైజంక్షన్ వద్ద రెండు భారీ వాహనాల రాకపోకలు ఉండకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల కొండపై వైజంక్షన్ వద్ద గల బారికేడు పూర్తిగా కూలిపోవడంతో పక్కన పడేశారు. కొండ కింది బారికేడు వాహనాలు ఢీకొని దెబ్బతిన్నది. భారీ వాహనాలు బారికేడు కింద నుంచి వెళ్లాలనే ప్రయత్నంలో బారికేడ్లు దెబ్బతిని ధ్వంసం అవుతుండగా పట్టించుకునే వారే లేకపోవడంతో భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ ప్రమాదానికి ముందు ఏర్పాటు చేసినవి ఇలాగే పడిపోవడం, మళ్లీ ఏర్పాటు చేయకపోవడంతో బస్సు ప్రమాదంతో పాటు అనేక ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలో భక్తులు మృత్యువాత పడ్డ సంఘటనలను గుర్తు చేసుకుంటున్నారు. ఇప్పుడు కూడా బారికేడు కూలిపోవడంతో అడ్డు కనిపించక బారీ వాహనాలు ప్రయాణించే అవకాశం ఉందని అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

బాకీ డబ్బులు చెల్లించడం లేదని ఇంటికి తాళం

- గర్జనపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి..
- పోలీసులకు బాధితుల ఫిర్యాదు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన బాకీ డబ్బులు చెల్లించకపోవడంతో మధ్యవర్తిగా ఉన్న పాపానికి ఇంటిలో నుంచి కుటుంబ సభ్యులను బలవంతంగా బయటకు గెంటేసి తాళం వేసిన సంఘటన వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. అప్పు ఇచ్చిన వ్యక్తి తమను మానసికంగా వేధించడంతో పాటు ఇంటికి తాళం వేశారని పేర్కొంటూ బాధితులు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. వారి కథనం మేరకు.. గ్రామంలోని అబ్రహం అదే గ్రామానికి చెందిన నరేశ్ వద్ద రూ2.50 లక్షల అప్పు తీసుకున్నాడు. అందుకు అతని సోదరుడు బాబు మధ్యవర్తిగా వ్యవహరించాడు. ప్రతినెలా వడ్డీ కింద అబ్రహం రూ.25 వేలు చెల్లించేవాడు. మూడు నెలల నుంచి డబ్బులు చెల్లించకపోవడంతో అబ్రహంను బాకీ ఇచ్చిన వ్యక్తి నరేశ్ అడిగాడు. పరిస్థితి బాగులేదని విన్నవించుకున్న ఆయన పట్టించుకోలేదు. మధ్యవర్తిగా ఉన్న బాబు ఇంటికి వెళ్లి తన డబ్బులు చెల్లించాలని లేనిపక్షంలో ఇంటికి తాళం వేస్తానని తేల్చిచెప్పాడు. కొంత గడువు ఇస్తే బాకీ డబ్బులు ఇప్పించేలా చూస్తానని ప్రాధేయపడినా వినిపించుకోకుండా బాబు ఇంటికి నరేశ్ తాళంవేశాడు. దాంతో బాధితులు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లలితాపూర్ గ్రామంలో బుధవారం రాత్రి రెండు మోటారు సైకిళ్లు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దేవంపల్లి గ్రామానికి చెందిన రేణికుంట బాబు(34) అనే యువకుడు మోటారు సైకిల్‌పై మానకొండూర్‌కు వెళ్లి తిరిగి వస్తున్నాడు. గంగిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి మోటారు సైకిల్‌పై కరీంనగర్ వెళ్తుండగా లలితాపూర్ బస్టాండ్ వద్ద ఎదురెదురుగా ఢీకొన్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో బాబుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

దాడి కేసులో ఒకరికి మూడు సంవత్సరాల జైలు

ధర్మపురి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలం దొంతాపూర్ గ్రామంలో తల్లి, తమ్ముళ్లపై దాడి చేసిన కేసులో ఎర్ర అక్షయ్‌కుమార్ (21)కు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ధర్మపురి కోర్టు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ యేగి జానకి తీర్పు వెలువరించారు. ధర్మపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో గల దొంతాపూర్ గ్రామానికి చెందిన ఎర్ర కళావతి భర్త మృతి చెందిన తరువాత తన పెద్ద కొడుకు అక్షయ్‌కుమార్ డబ్బులు అడుగుతూ తరచుగా గొడవలు పెట్టాడు. తల్లి, తమ్ముళ్లపై దాడికి పాల్పడడంతో అతడి బాధలు భరించలేక కళావతి తన తల్లిగారి ఇంటికి వెళ్లింది. 2020 అక్టోబరు 4న రాత్రి అక్షయ్‌కుమార్ తన స్నేహితులను తీసుకువచ్చి తల్లిని, తమ్ముళ్లు సంజయ్‌కుమార్, ఉదయ్ కుమార్‌లపై దాడి చేశాడు. కళావతి అన్న దాసరి కిషన్ అడ్డుగా వెళ్లగా అతడిపై కూడా దాడి చేశాడు. కొడుకు అక్షయ్‌కుమార్ వల్ల తనకు ప్రాణ భయం ఉందని బాధితురాలు కళావతి ధర్మపురి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నిందితుడు ఎర్ర అక్షయ్‌కుమార్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ యేగి జానకి తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితుడికి జైలు శిక్ష పడటంలో కృషి చేసిన అడిషనల్ పీపీ రాజేష్, ఇన్వెస్టిగేషన్ ఎస్‌ఐలు శ్రీకాంత్, కిరణ్‌కుమార్, సీఎంఎస్ ఎస్‌ఐ శ్రీకాంత్, కోర్టు పీసీ మహేష్‌లను ఎస్పీ అశోక్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

అయినవారు దూరమై అనాథగా బాలుడు

● మూడు రోజుల క్రితం తండ్రి, గతంలో తల్లి మృతి



స్వాద్విన్ కుమార్

చొప్పదండి, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలంలోని రాగంపేట గ్రామానికి చెందిన దీకొండ స్వాద్విన్‌కుమార్ తల్లిదండ్రులు కోల్పోవడంతో అనాథగా మారాడు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న స్వాద్విన్ కుమార్ తండ్రి దీకొండ అశోక్ గత ఆదివారం ఆకస్మికంగా మృతి చెందాడు. మూడు సంవత్సరాల క్రితం తల్లి ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో మరణించింది. తల్లి మరణించిన తరువాత అన్ని తానై పెంచిన తండ్రి కూడా మరణించ డంతో స్వాద్విన్ కుమార్ ఒంటరిగా మిగిలాడు. తాత,నానమ్మలు కూడా గతంలో మరణించగా బాలుడి పరిస్థితి దిక్కులేని వాడు అయ్యాడని గ్రామస్తులను కంటతడి పెట్టించింది. కన్నీటి పర్యంతం అవుతున్నాడు.

బీసీ సంఘాల బంద్‌ను విజయవంతం చేయాలి



బీసీ కుల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

గణేశ్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు ఈ నెల 18న బీసీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయలని ఆ సంఘం నేతలు పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లాలోని బీసీ సంఘాల, కుల సంఘాల నాయకులతో బుధవారం వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎన్నం ప్రకాష్, ఆది మల్లేశం, ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్, రాచమల్ల రాజు, నారోజు రాకేష్ చారి, కోడూరి పర్శరామ్ గౌడ్, నర్సింగోజు శ్రీనివాస్, రంగు సంపత్ గౌడ్, మాచర్ల అంజయ్య పాల్గొన్నారు.

రాష్ట్ర బంద్ జయప్రదం చేయాలి

భగత్‌నగర్ : బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఈ నెల 18న నిర్వహించతలపెట్టిన రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని కమాన్ చౌరస్తాలో బీసీ హక్కుల సాధన కోసం ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు చట్టాన్ని అమోదించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పిట్టల సమ్మయ్య, పైడిపల్లి రాజు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి తీవ్ర గాయాలు

సుల్తానాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపు తప్పిన ప్రమాదంలో వాహనం నడుపుతున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం ద్విచక్రవాహనంపై కరీంనగర్ నుంచి సుల్తానాబాద్ వైపు వస్తున్న పట్టణంలోని మార్కండేయకాలనీకి చెందిన దేవోజు లక్ష్మీనరసింహచారి(52) మండలంలోని కాట్నపల్లి వద్ద రాజీవ్ రహదారిపై అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ సంఘటనలో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108ద్వారా మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద వివరాలను తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

కల్వచర్లలో చోరీ.. పోలీసుల తనిఖీలు



కల్వచర్లలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

రామగిరి, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామంలోని సౌమిత్రి లావణ్య పాతగృహంలో చోరీ జరిగింది. శివాలయం వెనకల గల పాత ఇంటిలో స్టోర్ చేసిన ఇత్తడి, రాగి వస్తువులు చోరీకి గురయ్యాయి. ఉదయం పాత ఇంటిలోకి వెళ్లి చూడగా చోరీకి గురైనట్లు గుర్తించిన బాధితురాలు పోలీస్‌లకు సమాచారం ఇవ్వగా ఎస్‌ఐలు శ్రీనివాస్, దివ్య ఆధ్వర్యంలో పోలీస్‌లు ఘటనస్థలాన్ని పరిశీలించారు. అనంతరం డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. చోరీకి గురైన సొత్తు విలువ సుమారు రూ.70వేల వరకు ఉంటుందని అంచనా వేశారు.

● మార్కెట్‌లో జేబుదొంగతనం

మండలంలోని సెంటినరీకాలనీలోని సంతలో బుధవారం జేబుదొంగతనం చేస్తూ పట్టిబడిన ఇద్దరిని వ్యాపారస్తులు పట్టుకున్నారు. అనంతరం ఇద్దరిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

అగ్నిప్రమాదం

వేములవాడ క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని ఎస్‌ఆర్‌ఆర్(ఇన్‌కేబుల్) నెట్‌వర్క్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మెయిన్ బోర్డులో మంటలు చెలరేగి దట్టమైన పొగలు వ్యాపించాయి. షార్ట్‌సర్క్యూట్ ప్రభావంతో కార్యాలయంలోని దాదాపు రూ.2లక్షల విలువైన కంప్యూటర్లు, ఇతర కీలకమైన ఎలక్ట్రానిక్ పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. అయినప్పటికీ కేబుల్ నెట్‌వర్క్ సేవలకు ఎలాంటి అంతరాయం కలుగకుండా వెంటనే యజమాని కొలిపాక నర్సయ్య ప్రత్యామాయ ఏర్పాటు చేశారు. అనంతరం అగ్నిమాపక అధికారులు నష్టం అంచనా వేశారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బొమ్మకల్ గ్రామానికి చెందిన రాజేష్ తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా గుర్తించిన పోలీసులు బుధవారం అతడికి అప్పగించారు. 2023 నవంబరు 22న బొమ్మకల్‌లో సెల్‌ఫోన్ పోగొటుకున్న రాజేష్ కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీతో ఫోన్ కర్నూల్‌లో ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం రాజేష్‌కు సీఐ నిరంజన్‌రెడ్డి ఫోన్ అందజేశారు. ఫోన్ రికవరీలో కీలకంగా పనిచేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

జమ్మికుంట రూరల్ : జమ్మికుంటకు చెందిన లకిడి వీణరాణి ఇటీవల తన వివో మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకుంది. దీంతో వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీస్‌లు వెంటనే ఐఎంఈఐ నెంబర్ ద్వారా మొబైల్‌ను పట్టుకున్నారు. బుధవారం పోలీస్‌స్టేషన్లో ఎస్‌ఐ నాగరాజు మహిళకు ఫోన్ అందజేశారు. ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నప్పుడు వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసుకోవాలని పోలీసులు సూచించారు.

విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపుదలకు ఒప్పందం



ఒప్పంద పత్రాలను తీసుకుంటున్న ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాల పెంపుదలకు నాస్కోమ్ ఐటీ సెక్టర్ స్కిల్ కౌన్సిల్‌తో అవగాహన పూర్వక ఒప్పందం (ఎంఓయూ) చేసుకున్నట్లు శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ తెలిపారు. బుధవారం నాస్కోమ్ ఐటీ సెక్టర్ స్కిల్ కౌన్సిల్‌తో అవగాహన పూర్వక ఒప్పందం (ఎంఓయూ) చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మంచి కంపెనీలలో ఉద్యోగాలు రావడానికి అవకాశాలు కల్పిస్తారని, మూడు సంవత్సరాలు ఈ ఒప్పందం కొనసాగుతుందని తెలిపారు. అనంతరం నాస్కోమ్ ఐటీ సెక్టర్ స్కిల్ కౌన్సిల్ ప్రతినిధి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాల పెంపుదలే అవగాహన ఒప్పందం లక్ష్యమన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి, డాక్టర్ హరికాంత్ పాల్గొన్నారు.

'రహదారులపై ధాన్యం ఆరబెట్టవద్దు'..



శంకరపట్నం మండలంలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

శంకరపట్నం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రహదారులపై రైతులు వరి ధాన్యం ఆరబోయడం ద్వారా ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని రైతులు దారుల వెంట వరిధాన్యం ఆరబెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. కేశవపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల కొన్ని గ్రామాల్లో రైతులు తమ వరి పంటను రహదారులపై ఆరబెట్టడం గమనించినట్లు తెలిపారు. వాహనదారులు జారిపడడం, ప్రమాదాలు జరగడం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. రహదారులు ప్రజా వినియోగానికి చెందినవని, వాటిపై వస్తువులు, పంట ధాన్యం ఆరబెట్టడం వల్ల ప్రమాదాలు జరిగితే శిక్షార్హులు అవుతారన్నారు. రైతు సోదరులు తమ పంటలను రహదారులపై కాకుండా గ్రామాల్లో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో ఆరబెట్టాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

కూరగాయాల సాగు..

● అనుకూలించని పరిస్థితులు.. ఆందోళనలో కూరగాయల రైతులు ● పెరిగిన పెట్టుబడులతో నష్టాలు.. ● రవాణా సౌకర్యాలు లేక ఇబ్బందులు

ఇల్లంతకుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అనుకూలించని వాతావరణ పరిస్థితులతో కూరగాయల రైతులు ఆందోళన చెందుతున్నారు. కూరగాయల సాగు ఒడిదొడుకులతో కూడుకున్నప్పటికీ ప్రతి సంవత్సరం మండలంలో సాగువిస్తీర్ణం పెరుగుతోంది. చిన్న కమతాలు, నీటి సౌలభ్యం బాగాలేని రైతులు కూరగాయల సాగుకు ఎక్కువగా మొగ్గుచూపుతుంటారు. పెట్టుబడులు పెట్టి ఆదాయం కోసం ఎక్కువ కాలం వేచి ఉండని రైతులు సైతం కూరగాయ పంటలను సాగుచేస్తుంటారు. మండలంలోని రహీంఖాన్‌పేట, రామోజిపేట, తిప్పాపూర్, పొత్తూరు, దాచారం, వల్లంపట్ల తదితర గ్రామాలలోని రైతులు ఎక్కువగా కూరగాయల పంటలను సాగుచేస్తుంటారు. మండలంలో గత వానాకాలంలో 75ఎకరాల విస్తీర్ణంలో కూరగాయ పంటలను సాగుచేయగా ఈసారి అధికారుల లెక్కల ప్రకారం 90ఎకరాలు సాగుచేస్తున్నారు. దీనికి తోడు మరికొన్ని గ్రామాల్లోను కూరగాయలను సాగుచేస్తున్నారు. ఎక్కువగా టమాట, మిరప, కాకర, బీరకాయ, పచ్చిమిర్చి, కీరదోస



రహీంఖాన్‌పేట గ్రామంలో సాగవుతున్న టమాట



బీరతోటను పరిశీలిస్తున్న డివిజన్ హార్టికల్చర్ అధికారి

పంటలను సాగుచేయడానికి రైతులు మొగ్గు చూపుతుంటారు. వరుసగా కురిసిన వర్షాలతో పంటలను తీవ్ర నష్టం జరిగింది. దీనికి తోడు సరైన ధరలు లేకలేకపోవడంతో పెట్టుబడులు వచ్చేలా కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 25కిలోల టమాట బాక్స్ ధర ప్రస్తుతం రూ 400 వరకు రైతులు అమ్ముతున్నారు. టమాటాలను తెంపడానికే ఒక కూలీకి రోజుకు రూ 350 చెల్లిస్తున్నామని రైతులు పేర్కొంటున్నారు. గతంలో కంటే చేలకు తెగుళ్ళు ఎక్కువగా వస్తున్నాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం కూరగాయల రైతులకు అండగా నిలబడాలని రైతులు కోరుతున్నారు.

మార్కెటింగ్ సదుపాయం లేక..

కూరగాయలను పండించిన రైతులకు సరైన మార్కెటింగ్ లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నారు. కూరగాయలను తెంపిన అనంతరం ఆటలో సిరిసిల్ల, సిద్దిపేట, కరీంనగర్‌కు తరలించడానికి ఆటో కిరాయి తీసుకొని పోతుంటారు.

కొన్నికొన్ని సందర్భాలలో ఆటో కిరాయిలు, రైతుకు కూలీ కూడా పడటం లేదని పేర్కొంటున్నారు. స్వంత ఆటో ఉన్న రైతులు హైదరాబాద్‌కు తరలిస్తుండటంతో వారు కొంత లాభపడుతున్నారు. రైతులు తక్కువ పండిన రైతులు పారబోయడానికి ఇష్టపడక వారసంతలలో అమ్ముతూ నష్టాలు పూడ్చుకుంటున్నారు. ఒకప్పుడు లాభసాటిగా ఉన్న కూరగాయల సాగు తరచూ వర్షాలు పడుతుండటం వల్ల కోలుకోలేని పరిస్థితులలోకి నెట్టివేయబడుతున్నారు.

వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం జరిగింది

అవారి బాబు, కూరగాయల రైతు, తిప్పాపూర్



తరచూ వర్షాలు పడటంతో పాటు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు లేకపోవడం వల్ల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. 2.5 ఎకరాల విస్తీర్ణంలో కూరగాయలను సాగుచేశారు. టమాట, కీరదోస, చిక్కుడు పంటలను వేయడం ద్వారా లాభాలు వస్తాయని ఆశించా. పంటచేతికి అందివచ్చే వరకే రూ 2లక్షల పెట్టుబడులు అయ్యాయి. సరైన ధరలు లేకపోవడంతో పాటు తెగుళ్ల ఎక్కువగా రావడంతో కూరగాయల రైతులు నష్టాలు చవిచూడవలసిన పరిస్థితిలు ఏర్పడ్డాయి.

తెగుళ్లను తొలిదశలో గుర్తిస్తేనే లాభాలు..

వాసాల గోవర్ధన్, సిరిసిల్ల డివిజన్ హార్టికల్చర్ ఆఫీసర్



కూరగాయల పంటలను ఆశించే తెగుళ్లను తొలిదశలో గుర్తించి నివారణ చర్యలు తీసుకుంటే లాభాలు గడించవచ్చు. టమాల, మిరప పంటలకు ఆకు మచ్చ తెగుళ్ల వస్తే మాంకోజేట్ 2.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచాకారి చేయాలి. తామర పురుగులు ఆశిస్తే 2మీ.లీ డైమిథోయేట్‌ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయడం ద్వారా తెగుళ్ల బాధ తొలగిపోతుంది. రైతులు మారుతున్న పరిస్థితులను నిరంతరం గమనిస్తూ పంటలను తెంపుకోవాలి.

కలెక్టర్ గళంలో 'ఓ చిన్ని పిచ్చుక' పాట



పాట పాడుతున్న కరీంనగర్ కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అవనిలో అంతరిక్షంలో మగవారితో సమానం ఆడవారు. ఈనాటి కాలంలో పురుషులతోపాటు స్త్రీలు కూడా అన్ని రంగాల్లో రాణిస్తు న్నారు. అక్కడక్కడా నిరక్షరాస్యత, పేదరికం, ఆడవారిపై చిన్న చూపు వంటి కారణాలు అమ్మాయిల పాలిట శాపంగా పరిణమిస్తున్నాయి. తల్లిదండ్రులకు గర్భ శోకాన్ని మిగులుస్తున్నాయి. ఆడ పిల్లల మనుగడకు అడ్డంకిగా మారుతున్నాయి. ఈ దిశలో పుట్టుక నుంచి ఓ ఇంటి ఇల్లాలయ్యేవరకు ఆడపిల్లల సమస్యలను అర్థం చేసుకున్న కరీంనగర్ కలెక్టర్ పమేలాసత్పతి మదిలో ఓ ఆలోచన మెరిసింది.

హిందీలో స్వానంద్ కిర్కిరే అనే రచయిత రాసి, పాడిన పాటను తెలుగు లోకి అనువ దిస్తే సమాజంలో అవగాహన పెరుగుతుందని భావించారు. దీంతో ఖార్ఖానగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నంది శ్రీనివాస్‌ను పిలి పించుకొని తన అంతర్గత భావాన్ని ప్రస్తావించారు. ఆయన స్పందించి పాటను తెలుగులోకి అనువదించగా కలెక్టర్ స్వయంగా పాటను ఆలపించారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాటను ఆవిష్కరించారు.

రాజన్న ఆలయ అభివృద్ధే ప్రధాన ఎజెండా..

● అందరి సలహాలు, సూచనల మేరకు పనులు
● 19న వేములవాడకు శృంగేరి పీఠాధిపతి రాక
● దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్



రాజన్న ఆలయ పరిశరాలను పరిశీలిస్తున్న శైలజరామయ్యార్, ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాజన్న ఆలయ అబివృద్ధే ప్రధాన ఎజెండా అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి ఈనెల 19వ తేదీన శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి స్వామి రాక సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్, వీటీడీఏ వైస్‌చైర్మన్ కలెక్టర్ ఎం హరిత, ఎస్పీ మహేష్ బీగితే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయ అబివృద్ధి విస్తరణ పనులు భక్తుల విశ్వాసాలు, అభిప్రాయాలు, పండితులు ఇతర ప్రముఖుల సలహాలు సూచనలు మేరకు చేపడుతున్నామని తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఇతర మంత్రుల సహకారంతో పనులు ముందుకు సాగుతున్నాయని వివరించారు. మొదటి దశలో రూ.76 కోట్లతో ప్రధాన ఆలయ విస్తరణ, అభివృద్ధి, రూ.35 కోట్లతో అన్న ప్రసాద వితరణశాల, రూ.47 కోట్లతో ప్రధాన రహ దారి విస్తరణ పనులకు శ్రీకారం చుట్టామని తెలి పారు. భక్తుల విశ్వాసాలు, నమ్మకాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి విస్తరణ చేస్తామని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ పనులపై ప్రతి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్నామని తెలిపారు. ఈనెల 19వ తేదీన శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతిస్వామి రానున్నారని వెల్లడించారు. ఈ మేరకు చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించామన్నారు. భక్తులకు రాజన్న ఆలయ ఆవరణలో ఎల్ఈడీ స్క్రీన్, ప్రచారథంలో దర్శనం కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యార్, వీటీ డీఏ వైస్‌చైర్మన్, కలెక్టర్ ఎం. హరిత, ఎస్పీ మహేష్ బి.గితే ఆలయ ఈవో రమాదేవి ఉన్నారు.

నరసింహుడి హుండీ ఆదాయం 46.84 లక్షలు



హుండీ లెక్కింపులో పాల్గొన్న మహిళలు

ధర్మపురి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించగా రూ.46,84,046 ఆదాయం లభించింది. గత జూన్ 26 నుంచి అక్టోబరు 15 వరకు గల హుండీలు తెరచి లెక్కింపు నిర్వహించగా ఈ ఆదాయం లభించింది. 27 గ్రాముల మిశ్రమ బంగారం, 4 కిలోల 700 గ్రాముల మిశ్రమ వెండి, 26 విదేశీ నోట్లు లభించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, దేవాదాయ శాఖ జగిత్యాల డివిజన్ పరిశీలకులు ఎం. రాజమౌళి, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పెన్షనర్ల బకాయిలు చెల్లించే వరకు ఉద్యమం

రేవా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి



జగిత్యాల కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న రిటైర్డు ఉద్యోగులు

జగిత్యాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల బకాయిలు చెల్లించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని రిటైర్డు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (రేవా) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కోహెడ చంద్రమౌళి అన్నారు. బుధవారం జగిత్యాల కలెక్టర్ కార్యాలయం వద్ద రేవా ఉమ్మడి జిల్లా ఆధ్వ ర్యంలో రిటైర్డు ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఏవో హకీంను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కోహెడ చంద్రమౌళి మాట్లాడుతూ 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు ఉద్యోగ విరమణ చెందిన ఉద్యోగుల, ఉపాధ్యాయుల ప్రయోజనాలు వచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత వెంటనే రావాల్సిన బకాయిలు అందక పెన్షనర్లు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పెడచెవిన పెడుతోందని విమర్శించారు. పెన్షన్ బకాయిలు రాక పెళ్లిళ్ల చేయలేక, ఇల్లు కట్టుకోలేక అనారోగ్యంతో బాధపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గద్ద జగదీశ్వరచారి, ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఎన్నం రాంరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ మామిడాల లక్ష్మీ నారాయణ, కోశాధికారి కనపర్తి దివాకర్, ఐల్నేని నరేందర్‌రావు, వెంకట రమణ, నసీం అహ్మద్, కటకం ప్రభు, కరుణ శ్రీ, రాందాస్, వేణుగోపాల్, విమల, చంద్రమౌళి,చంద్రశేఖర్, దుబ్బయ్య, మదన్‌మోహన్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక





నందకిషోర్, వాత్సల్య

గంగాధర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల పీడీలు తెలిపారు. గంగాధర ప్రభుత్వ పాఠశాలకు చెందిన కట్ల నందకిషోర్ సిరిసిల్లలో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ 17 వాలీబాల్ టోర్న మెంటులో ప్రతిభ కన బర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సంగారెడ్డిలో ఈ నెల 16 నుంచి జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్నట్లు పీడీ బాబు శ్రీనివాస్ తెలిపారు. గంగాధర మోడల్ స్కూల్‌కు చెందిన వాత్సల్య అండర్ 14 విభాగంలో పెద్దపల్లి జిల్లాలో జరిగిన కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ నాగార్జున తెలిపారు.

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సీఈసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని అనుష్క రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీ లకు ఎంపికయింది. మంగళవారం కరీంనగర్‌లోని ఎల్ఎండీ కాలనీలోని శ్రీచైతన్య డిఫెన్స్ అకాడమిలో ఉమ్మడిజిల్లాల స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 19 విభాగంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఇందులో అనుష్క తన క్రీడాప్రతిభను చాటి రాష్ట్రస్థాయి పోటీల్లో స్థానం దక్కించుకుంది. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థినిని కళాశాల స్పోర్ట్స్, గేమ్స్ ఇన్‌చార్జి సునీల్‌తోపాటు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.



అనుష్కను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

మల్యాల : మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పాఠశాలల కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్-14 విభాగంలో జి.యశశ్వని, జి.హారిక జగిత్యాల జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మధులిక తెలిపారు. ఈ నెల 16 నుంచి మూడు రోజుల పాటు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో జరిగే పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మండల విద్యాధికారి ఎన్.జయసింహరావు, క్రీడల మండల కన్వీనర్ విశ్వప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

పెద్దపల్లి రూరల్: మండలంలోని నిట్టూరు జిల్లా పరిషత్ పాఠశాలలో చదవుతున్న శ్రీజ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు లక్ష్మయ్య తెలిపారు. ఈ సం దర్భంగా బుధవారం పాఠశాలలో విద్యార్థిని శ్రీజను ఉపాధ్యాయ బృందంతో కలిసి అభినందించారు. అక్టోబరు 14న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్‌జీఎఫ్ అండర్ 14 కబడ్డీ పోటీలు జరిగాయి. పోటీల్లో శ్రీజ అత్యంత ప్రతిభ కనబరిచి సంగా రెడ్డి పటాన్‌చెరువులో ఈనెల 16 నుంచి 18 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీ కుంబాల సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శ్రీజను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న ఆనంది

జాతీయ స్థాయిలో మూడో స్థానంతో గుర్తింపు



కమాన్‌పూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో ఈనెల 14న జరిగిన 40వ జాతీయ జూనియర్ చాంపియన్ షిప్ అండర్ 16 విభాగంలో నల్లవెల్లి ఆనంది మూడో స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ అందుకున్నది. మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన నల్లవెల్లి శంకర్ భారతిల రెండో కుమార్తె ఆనంది గుండారం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువు తున్నది. అలాగే ఆమె అథ్లెటిక్స్‌లో కన్సిస్టెన్సీగా తన ప్రతిభతో రాణిస్తూ పలు మెడల్స్ సాధించింది. ఈ మేరకు భువనేశ్వర్‌లో జరిగిన పోటీల్లో మరో సారి రాణించి మెడల్ సాధించడంపై లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, ఆనంది కోచ్ సుబ్బారావు, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సారంగపాణి, జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి గట్టయ్య, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌లు బుధవారం ఆనందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆనంది పాల్గొంటున్న టోర్నీల్లో ప్రతిభతో మెడల్స్ సాధించడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. అలాగే పలు మెడల్స్ అందుకొని, పుట్టిన ఊరుకు, రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

విద్యార్థులకు వాల్ పెయింటింగ్ పోటీలు

గణేశ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ప్రారంభించి ఐదేళ్ల పూర్తయిన సందర్భంగా మహిళలు, పిల్లలు దివ్యాంగులు వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జూనియర్ కళాశాలల విద్యార్థులకు డ్రగ్స్‌తో కలిగే అనర్థాలను తెలియజేసే విధంగా బుధవారం వాల్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు.

కరీంనగర్ పోలీస్ కమిషనర్ కార్యాలయ కాంపౌండ్‌పై మత్తు పదార్థాల వినియోగంతో కలిగే సమస్యలను పెయింటింగ్ ద్వారా వివరించారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఎన్ఎంబీఏ కమిటీ సభ్యులు పెండ్యాల కేశవరెడ్డి, మర్రి రాజేందర్ పోటీలను పర్యవేక్షించారు.

మల్లాపూర్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా జగదీష్

మల్లాపూర్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి)15: మల్లాపూర్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా జగదీష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్న శశి కుమార్‌రెడ్డి పెగడపల్లికి బదిలీ అయ్యారు. మల్లాపూర్‌కు రెగ్యులర్ ఎంపీడీవోగా నూతన గ్రూప్-1 అధికారి అలవాల శ్రీకాంత్‌ను నియమించగా ఆయన ట్రైనింగ్‌కు వెళ్లడంతో ఇన్‌చార్జిగా జగదీష్ బాధ్యతలు చేపట్టారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

రాయికల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణం లోని గ్రీన్‌వుడ్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో పెద్దపల్లిలో జరిగిన అండర్-14 కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోతరాజు అద్విత, పంచతి మధుప్రియలు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పటాన్‌చెరులో జరిగే క్రీడల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ మిట్టపెల్లి మహేష్ రెడ్డి, డైరెక్టర్ కాకర శ్రీనివాస్ రెడ్డి, హెచ్‌ఎం రాజేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థి

రాయికల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపతిపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థి సోమ మన్విత్ రెడ్డి అండర్-14 ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. ఉమ్మడి జిల్లా స్థాయిలో అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఈ సందర్భంగా విద్యార్థిని వ్యాయామ ఉపాధ్యాయుడు బోగ రాజశేఖర్, విక్రమ్, సత్యరాజ్‌లు అభినందించారు.

పాల కేంద్రం భవనం ప్రారంభం

మల్యాల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దుట్లలో నూతనంగా నిర్మించిన పాల ఉత్పత్తిదారుల సంస్థ నూతన భవనంను గురువారం కరీంనగర్ డెయిరీ చైర్మన్ చలిమెడ రాజేశ్వర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాల దిగుబడులు పెంచా లని తద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించ వచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో నూకపల్లి సింగిల్‌విండో చైర్మన్ బోయినిపల్లి మధుసూధన్‌రావు, పాల ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షుడు మ్యాకల మహేశ్, పాలకవర్గం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

కొడిమ్యాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూర్ గ్రామ శివారులో నిర్మిస్తున్న రామాలయం నిర్మాణానికి బుధవారం పలువురు దాతలు విరాళాలను అందించారు. మండలంలోని గౌరాపూర్ గ్రామానికి చెందిన బండ సుగుణ వెంకట్‌రెడ్డి కుటుంబ సభ్యులు 25,116 రూపాయలను, మార్క రమేష్ 11,116 రూపాయలు, కాసాని అనూషమనోజ్ 5116, మచ్చ లతరవి 2,116 రూపాయలు విరాళం అందించినట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. విరాళాలు అందించిన దాతలకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రయోగాత్మక విద్యతో పరిపూర్ణ జ్ఞానం



సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అగ్రికల్చర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రయో గాత్మక విద్యతో పరిపూర్ణ జ్ఞానం సిద్ధిస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని అరవింద్‌నగర్‌లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పురాణిపేట పాఠశాలలో రూ.13.50 లక్షలతో నూతనంగా నిర్మించిన సైన్స్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే చేతులమీదుగా బుధవారం ప్రారంభించారు. అనం తరం ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ పరికరాలను వినియో గించుకొని ఖచ్చితమైన కొలతలు, ఫలితాల సాధనతో పాటు, ఆవిష్కరణలకు ఒక వేదికగా పనిచేస్తుందన్నారు. అత్యాధునిక అన్నిరకాల వసతులతో కూడిన ల్యాబ్‌ను విద్యార్థులు సద్విని యోగం చేసుకోవా లన్నారు. కార్యక్రమంలో డీఈవో రాము, జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్, మున్సిపల్ మాజీ చైర్మన్లు అడువాల జ్యోతిలక్ష్మణ్, గిరినాగభూషణం, ఏఈ ధనుంజయ్, ప్రిన్సిపాల్ తిరుపతి పాల్గొన్నారు.

అభివృద్ధే మా లక్ష్యం

జగిత్యాల అర్బన్: అభివృద్ధి, సంక్షేమమే తన లక్ష్యం అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల పట్టణంలోని నూకపెల్లి అర్బన్ కాలనీలో డబుల్ బెడ్‌రూం, ఇందిరమ్మ ఇండ్లలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అర్బన్ కాలనీ శివారులోని డంపింగ్ యార్డును పరిశీలించి డంపింగ్ యార్డును ఎమ్మెల్యే పరిశీలించారు. డంపింగ్ యార్డు వద్ద అకాల వర్షాలు, వరద ప్రభావ ప్రాంతాలలో కల్వర్టులు పైప్ లైన్ లు పరిశీలించిన ఆయన డంపింగ్ యార్డుకు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు సూచించారు. అంతకు ముందు జగిత్యాల పట్టణంలోని మార్కెట్ వెనుక గల 36 వవార్డులో 36 లక్షలతో నిర్మిచ తలపెట్టిన మురికి కాలువ, సిసి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటారని అన్నారు. పట్టణంలో మంజూరు అయిన పనులు పూర్తి చేసేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని పనుల విషయంలో సమస్యలు ఉంటే వేరే చోటికి మార్చి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అన్నారు. ఆయా కార్యక్రమాలలో మున్సిపల్ కమీషనర్ స్పందన, నాయకులు అడువాల లక్ష్మణ్, డిఈలు మిలింద్, ఆనంద్‌పాల్గొన్నారు.

●**జగిత్యాలరూరల్:** పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్ప కుండా వేయించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పాడి రైతులకు సూచించారు. జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం గ్రామంలో జల్లాపశువైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పశు వ్యాధుల నిర్మూలన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో రూ.12లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీకేంద్రాన్ని ప్రారంభం చేసి జిల్లా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాస, అన్నప్రసాన, సీమంతం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ అక్టోబరు 15 నుంచి నవంబరు 14 వరకు అన్ని గ్రామాల్లో టీకాలు వేస్తారని ఎమ్మెల్యే తెలిపారు. 4 నెలలుదాటిన పశువు లకు అన్నింటికి టీకాలు వేయించి పశుసంపదను కాపాడాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ నరేష్‌రెడ్డి, ఐసీడీఎస్ సీడీపీవో మమత, సూపర్‌వైజర్ లావణ్య, ఎంపీవో రవిబాబు, ఏపీఎం రాజయ్య, వెటర్నరీ, ఐకేపీ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

డీసీసీ పీఠం దక్కేదెవరికో..?

(ఏడో పేజీ తరువాయి)

డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు, ధర్మపురి దేవస్థాన అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ జువ్వాడి కృష్ణారావు, టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు శేర్ నర్సారెడ్డి తదితరుల పేర్లు తెరపైకి వస్తున్నాయి. పలువురు బీసీ, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నేతలు అధ్యక్ష పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పలువురు మహిళా నేతలు సైతం అధ్యక్ష పీఠంపై దృష్టి సారించినట్లు సమాచారం. కాంగ్రెస్ బీసీ కార్డుతో ముందుకు వెళ్తున్న నేపథ్యంలో డీసీసీ పగ్గాలు బీసీలకు వస్తాయని మరికొందరు అంటున్నారు. వీటికి తోడు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కోరుట్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అభిప్రాయాలు ఎలా ఉంటాయో.. చివరకు డీసీసీ పీఠం ఎవరిని వరిస్తుందోనన్న చర్చలు కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో చోటుచేసుకుంటున్నాయి.

● ముగ్గురి పేర్లతో అధిష్ఠానానికి జాబితా

పదేళ్లుగా ప్రతిపక్ష పార్టీగా ఉండి ప్రస్తుతం అధికారంలోకి రావడంతో పార్టీ పదవులపై పలువురు ఆశావహులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు సైతం ఎవరికీ పెద్దగా దక్కలేదు. ఈ క్రమంలో సీనియర్ నాయకులు తమకు పదవులు ఇవ్వాలని కోరుతున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన విషయం విదితమే. అయితే అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నానని ప్రకటించారు. ఈ వ్యవహారం అసెంబ్లీ స్పీకర్ పరిశీలనలో ఉంది. అసెంబ్లీ స్పీకర్ నిర్ణయం తీసుకుంటే గానీ స్పష్టత వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. ఈ వ్యవహారంతో అటు బీఆర్ఎస్‌లో, ఇటు కాంగ్రెస్‌లో తమకు పదవులు దక్కడం లేదని ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్ అనుచరులు నిరాశతో ఉన్నారు. కాగా ఏఐసీసీ, టీపీసీసీ పరిశీలకులు జిల్లాలో పర్యటించి కార్యకర్తల నుంచి అభిప్రాయాలు తీసుకొని ముగ్గురు పేర్లతో జాబితా పంపించనున్నారు. ఆ ముగ్గురు జాబితాలో ఎవరికి చోటు లభిస్తుందోనని ఆశావహులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

18న రాష్ట్రవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలి

-బీసీ సంఘాల నాయకుల పిలుపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీసీ సంఘాల నాయకులు

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న తలపెట్టిన రాష్ట్రవ్యాప్త బంద్‌ను సహకరించి విజయవంతం చేయాలని బీసీ జేఏసీ నాయకులు పుప్పాల లింబాద్రి, మాజీ ఎంపీపీ తోగిటి అంజయ్య, నల్ల వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం స్థానిక విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు బొమ్మెల శంకర్, చింతకుంట దేవేందర్, భోగ గంగాధర్, జంగిటి శ్రీధర్, రాంపల్లి బాలరాజు, దోమకొండ రమేస్, జెట్టి నరేందర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

●**మెట్‌పల్లి రూరల్:** రాష్ట్ర బీసీ సంఘాల జేఏసీ పిలుపు మేరకు ఈనెల 18న చేపట్టిన తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయాలని సంఘం నాయకులు కోరారు. బుధవారం మండలంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో 9ని అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. బీసీల రిజర్వేషన్లు అమలుకు మార్గం సుగమం అయిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజక వర్గం బీసీ జేఏసీ నాయకులు పుప్పాల లింబాద్రి, మాజీ ఎంపీపీ తోగిటి అంజయ్య, ఆకుల శ్రీనివాస్, నల్ల వెంకటేశ్వర్లు, బొమ్మెల శంకర్, చింతకుంట దేవేందర్, భోగ గంగాధర్, జంగిటి శ్రీధర్, రాంపల్లి బాలరాజ్, తదితరులు పాల్గొన్నారు.

●**ధర్మపురి:** బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో అక్టోబరు 18 న తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధికార ప్రతినిధి కుర్మాచలం ఉమామహేష్ ఒక ప్రకటనలో కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు న్యాయమైన వాటా దక్కేలా చూడాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. 42 శాతం రిజర్వేషన్ సాధన కోసం బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంఉల తలపెట్టిన బంద్‌లో అన్ని వర్గాలు పాల్గొని సహకరించాలని ఆయన విజ్ఞప్తి విజ్ఞప్తి చేశారు.

●**గొల్లపల్లి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న తలపెట్టిన రాష్ట్రవ్యాప్త బంద్‌కు ప్రతి ఒక్కరు సహకరించి విజయవంతం చేయాలని బీసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం గొల్లపల్లి మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం భవనంలో మండలం నలుమూలల నుంచి తరలివచ్చిన బీసీ సంఘాల నాయకులు బంద్ సన్నాహక సమావేశం నిర్వహించారు. రిజర్వేషన్ల అమలే మన పంతం కావాలని బీసీలతో పాటు అన్ని వర్గాల ప్రజలు దీనికి సహకరించాలని కోరారు. గొల్లపల్లిలో నిర్వహించే బంద్‌లో వ్యాపార, వాణిజ్య సంస్థలు, విద్యా సంస్థలు బంద్‌కు సహకరించాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలి

కొడిమ్యాల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలతో కూడిన వరిదాన్యం కొనుగోలు చేయాలని తహసీల్దార్ ఎం. కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో వరిధాన్య కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు, వీవోఏలకు, బుక్ కీపర్లకు, కమిటీ సభ్యులకు ధాన్యం కొను గోలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. తప్ప తాలు లేకుండా, శుభ్రం చేసిన ధాన్యం తీసుక రావాలని రైతులకు సూచించారు. అంతక ముందు ఏవో పి. జ్యోతి మాట్లాడుతూ రైతులు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుక వచ్చిన తర్వాత ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఏఈవోలు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు పద్మ, సీసీలు శ్రీనివాస్, వీరకుమార్. కమల కుమారి, స్వరూప తదితరులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కథలాపూర్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరికొండలో అతి పురాతన శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంకు బుధ వారం ఎన్ఆర్ఐ నీలి కన్నయ్య ఆధ్వర్యంలో దుబాయిలో ఉన్న మిత్రులు కలిసి రూ.45 వేలు విరాళంగా అందజేశారు.

ఆలయ పునర్నిమాణానికి గ్రామస్థులు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో విరాళాలు సేకరించామని ఎన్ఆర్ఐలు తెలిపారు.

మార్కెటింగ్ శాఖ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, ఇతర అధికారులు

జగిత్యాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోళ్లు, మద్దతు ధర అందజేత అంశాలపై మార్కెటింగ్ శాఖ రూపొందించిన వాల్ పోస్టర్లను బుధవారం జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఆవిష్కరించారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తరలించి మద్దతు ధరను పొందాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, ట్రైని డిప్యూటీ కలెక్టర్ హరిణి, డీఆర్‌డీఓ రఘు వరన్, జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్, సివిల్ సప్లయి కార్పొరేషన్ డీఎం జితేంద్ర ప్రసాద్, మార్కెటింగ్ శాఖ ఏడీ ప్రకాశ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అందరికీ సీపీఆర్‌పై అవగాహన ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ అంజిత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో అత్యధికంగా పెరుగుతున్న గుండె పోటు మరణాల నివారణలో భాగంగా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. సీపీఆర్ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో డాక్టర్ తాటిపర్తి శివానిరెడ్డితో కలిసి డాక్టర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అంజిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా చిన్నా, పెద్దా అనే తేడాలు లేకుండా గుండె జబ్బుతో ప్రాణాలు పోతున్నయన్నారు. ప్రతి ఒక్కరు సిపీఆర్ కార్డియో పల్మనరీ రీసెర్సిటేషన్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. మన చుట్టు ఉన్న వారిలో ఎవ్వైనా గుండె సమస్య వచ్చినప్పుడు కార్డియో కరెస్టు నుండి సిపిఆర్ చేసి అంబులెన్స్ సహాయంతో ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడ వచ్చునన్నారు. ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, తమ జీవనశైలిలో మార్పులతో వ్యాధులను అరికట్టవచ్చని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు హెల్త్ సూపర్‌వైజర్ అచ్యుతరావు, జటన్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

బీర్‌పూర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంఈవో నాగభూషణం అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు జూపాక సుదర్శన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 120 మంది విద్యార్థులకు సబ్బులు, సబ్బు డబ్బాలను ఎంఈవో నాగభూషణం చేతుల మీదుగా అందించారు. విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పడి మంజుల ధరణి, సీఆర్‌పీ సురేష్, ఉపాధ్యాయులు రమాదేవి, నాగరాణి, స్వరూప, లలిత, మౌనిక పాల్గొన్నారు.

'అభివృద్ధి పనులకు నిధులను కేటాయించాలి'



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల నియోజకవర్గంలో అభివృద్ధి పనులతో పాటు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు రాష్ట్ర మంత్రులను బుధవారం కలిశారు. సచివా లయంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డిలను కలిసి నియోజక వర్గంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు స్థానిక విలేకర్లతో ఫోన్‌లో మాట్లాడారు. మొక్కజొన్న కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల ఇబ్బందులు తొలగించాలని కోరినట్లు తెలిపారు. అభివృద్ధి పనులకు నిధుల కేటాయించేందుకు మంత్రులు సానుకులంగా స్పందించినట్లు జువ్వాడి తెలిపారు.

పశువులకు ఉచితంగా గాలికుంటు టీకాలు

జగిత్యాలరూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని ధర్మారం గ్రామంలో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి టీకాలను వేశారు. ఈసందర్భంగా 26 తెల్లజాతి పశువులకు, 216 గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈకార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ వాసుపావని, పొలాసలైవ్‌స్టాక్ అధికారి పూర్ణచందర్, లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు విశాల్, నరేష్, సిబ్బంది రాజు, వెంకటమ్మ, గంగయ్య, రాములు, అనిత, తదితరులు పాల్గొన్నారు.

●**మెట్‌పల్లి రూరల్:** ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మెట్‌పల్లి విశాల సహకార సంఘం చైర్మన్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. పశువైద్య, పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని చౌలమద్ది గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మండల పశువైద్యాధికారి మనీషాపటేల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనీషాపటేల్ మాట్లాడుతూ ఆవులు, గేదెలతో పాటు మూడు నెలల పైబడిన దూడలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించు కోవాలన్నారు. కార్యక్రమంలో ఎల్ఎస్‌సీఎస్ డైరెక్టర్లు అల్లూరి రాజేశ్వరెడ్డి, కొప్పెల రాములు, మాజీ సర్పంచ్ గడ్డం లింగారెడ్డి, పశువైద్య సిబ్బంది రమాదేవి, రమణయ్య, గంగాధర్, దిలీప్, మోహన్, రైతులు భూమయ్య, గంగారాం, అంజయ్య, శేఖర్ పాల్గొన్నారు.

●**కథలాపూర్:** మండలంలోని దుంపెటలో బుధవారం జాతీయ పశువ్యాధులు నివారణ కార్యక్ర మంలో భాగంగా పశువులకు గాలికుంటు వ్యాధి నిర్మూలన కార్య క్రమం నిర్వహించారు. 79 గేదెలు, ఆవులు, ఎద్దులకు వ్యాధి నివారణ టీకాలు వేశామని వైద్యాధికారిణి దివ్యశ్రీ తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఉన్నారు.

●**గొల్లపల్లి:** పశువులకు సోకే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి పశు సంపదను కాపాడుకోవాలని ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్ పాడి రైతులకు సూచించారు. బుధవారం గొల్లపల్లి మండలం తిర్మలాపూర్ (పీడీ) గ్రామంలో పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరంను నిర్వహించగా ఏఎంసీ చైర్మన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు ఎరవేణి రమేష్, మార్కెట్ డైరెక్టర్ గంగామియా, పీఎల్‌వో రవీందర్, ఎల్ఎస్‌ఏ రాజశ్రీ, రవీందర్, నర్సయ్య, నిశాంత్, రమేష్, పశువైద్యా సిబ్బంది, స్థానిక నాయకులు, పాడిరైతులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశు వైద్య భవనాలు

● పట్టించుకోని అధికారులు ● ఇబ్బందులు పడుతున్న పశు పోషకాలు, సిబ్బంది



భూపతిపూర్‌లో శిథిలావస్థలో ఉన్న పశు వైద్యశాల

రాయికల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని మూటపెల్లి, భూపతిపూర్ గ్రామాల్లోని పశు వైద్య కేంద్రాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. దశాబ్ధాల క్రితం నిర్మించిన ఈ భవనాల్లో వర్షం కురిస్తే కారడంతో పాటు పైకప్పుల్లో ఉన్న పెచ్చులు పడిపోవటంతో పశువైద్య సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. మండలంలోని మూటపెల్లిలో పశు వైద్యశాల పూర్తిగా శిథిలావస్థకు చేరుకోగా భయాందోళనకు గురైన పశు వైద్య సిబ్బంది గ్రామస్థుల సహకారంతో తాత్కాలికంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు తరలించారు. దీంతో గ్రామంలోని పశువులు, గేదెలకు సరైన వైద్య సేవలు అందించాలంటే పశు వైద్య సిబ్బందికి సైతం సరైన పనిముట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలోని భూపతిపూర్ గ్రామంలోని సబ్ సెంటర్‌లో వర్షం కురిస్తే వర్షపు నీరు చేరడంతో పాటు ఉన్న మందులు సైతం తడిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూపతిపూర్ సబ్ సెంటర్ పరిధిలోకి భూపతిపూర్, ఒడ్డెలింగాపూర్, ధర్మాజీపేట, కట్కాపూర్, దావన్‌పెల్లి, కైరిగూడెం, తాట్లవాయి గ్రామాలు ఉండగా, 8500 గొర్రెలు, 1640 ఆవులు, 2128 గేదెలు ఉన్నాయి. మూటపల్లి సబ్‌సెంటర్ పరిధిలో బోర్నపెల్లి, జగన్నాథ్‌పూర్, చింతలూరు, బషీర్‌పల్లి, వస్తాపూర్, ఒడ్డెర కాలనీ, మూటపెల్లి గ్రామాలు ఉండగా, 11,228 ఆవులు, గేదెలు, 2200 గొర్రెలు, మేకలు ఉన్నాయి. ఇప్పటికైనా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జిల్లా పశు వైద్యాధికారి స్పందించి నూతన భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ

మల్లాపూర్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ శంకరమ్మ అన్నారు. మండలంలోని ముత్యంపేట గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసం కార్యక్రమాలను అధికారులు ఘనంగా నిర్వహించారు. పోషణమాసం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఐసీడీఎస్ సూపర్ వైజర్ శంకరమ్మ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరమ్మ మాట్లాడుతూ బాలింతలు, గర్భిణీలు తీసుకోవాలసిన పోషకాలను వివరించారు. మనం తీసుకునే ఆహారంలో ఎలాంటి పోషక విలువలు ఉన్నాయో, పోషకాలపై ఎలాంటి ఆరోగ్య లాభాలు ఉంటాయో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఆమెటి శ్రీలత, దాసరి లక్ష్మి, సుద్దాల కృష్ణవేణితో పాటు మహిళలు పాల్గొన్నారు.

●**రాయికల్:** రాయికల్ మున్సిపల్ పరిధిలోని రాయికల్-1 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ మాస వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం వల్ల కలిగే లాభాలను వివరించారు. ఆకు కూరలలో ఐరన్, విటమిన్, మినరల్స్ ఎక్కువ శాతం ఉంటాయని, అవి జీర్ణ వ్యవస్థకు చాలా తోడ్పడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పోషణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎలిగేటి సుజాత, సంపత్, రాజేశ్వరి, ఏఎన్ఎం విజయలక్ష్మి, పలువురు గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

●**కథలాపూర్:** సమాజంలో ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని సీడీపీఓ మణెమ్మ పేర్కొన్నారు. కథలాపూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మహిళా సాధికారిత సంస్థ, సఖి కేంద్రం ఆధ్వర్యంలో ఆడపిల్లల పుట్టుక గురించి మహిళలకు వివరించారు. ఆడపిల్లల జననాన్ని స్వాగతిం చడానికి, గౌరవించడానికి బేటీ జన్మోత్సవ్ కార్యక్రమం జరుపు కుంటారని పేర్కొన్నారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించా లన్నారు. వివిధ రకాల కూరగాయలు, చిరు ధాన్యాలు ప్రదర్శించారు. ఆడపిల్లలు పుట్టిన తల్లిదండ్రులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్రవంతి, మహిళా సాధికారిత సంస్థ సిబ్బంది స్వప్న, గౌతమి సఖి సెంటర్ సిబ్బంది, భాగ్యలక్ష్మీ, తేజస్ ఫౌండేషన్ సభ్యులు రాధ, వైద్యాధికారిణి సింధూజ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

●**కొడిమ్యాల:** తల్లులు పోషకాహారం భుజిస్తె వ్యాధులు దూరమవుతాయని ఐసీడీఎస్ కొడిమ్యాల సూపర్‌వైజర్ ఉమ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగనన్‌వాడీ కేంద్రాలలో పోషణ మాసం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవటంతో తల్లులతో పాటుగా చిన్నారులు కూడ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంతకుముందు అంగన్‌వాడీ కేంద్రాలకు తల్లులు పోషకాహారంతో కూడిన వంటలను తీసుకవచ్చారు. ఈ కార్యక్రమాలలో అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మీ, కాంతమ్మ, హసీనా, మమత, స్వప్న, లావణ్య, కవిత, అర్చన, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.